దుర్గమ్మా కరుణించు..

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నవరాత్రి ఉత్సవాలు కొనసాగాయి. అమ్మవారు ఆయా మండపాల వద్ద మహాలక్ష్మిగా, మహిషాసురమర్దినిగా తదితర రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు.

- జడ్చర్లలో అమ్మవారిని మహాగౌరి, మహిషాసురమర్దిని, దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో చండీహోమం శుక్రవారం కొనసాగించారు. భక్తులకు అన్నదానం చేశారు.
- హన్వాడలో కుంకుమార్చన చేపట్టారు.
- దేవరకద్రలో మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు.
- భూత్పూర్ పరిధిలోని అమిస్తాపూర్‌లో 8వ రోజు అన్నదాన కార్యక్రమం కొనసాగింది.
- నవాబుపేటలోని శివాలయంలో మహాయజ్ఞం నిర్వహించారు. ప్రధానపూజారి రామేశ్వరయ్య కార్యక్రమం చేపట్టారు.


హన్వాడ కుంకుమార్చన చేస్తున్న భక్తులు


దేవరకద్ర దళితవాడలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు


దేవరకద్ర పోచమ్మ ఆలయం వద్ద..


జడ్చర్ల సకలదేవతల ఆలయంలో..


నవాబుపేటలో యాగం


భూత్పూర్‌లో అన్నదానం


జిల్లాకేంద్రం లక్ష్మీనగర్ కాలనీలో..


జిల్లాకేంద్రంలో దుర్గమ్మ అలంకారంలో రేణుకమాత


అమిస్తాపూర్‌లో సాక్షి గణపతి ఆలయంలో..


దేవరకద్రలో వాసవీమాత ఆలయంలో..


బోయపల్లిలో..

వైభవంగా ఆయుధ పూజ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దసరా పండుగను పురస్కరించుకుని రాయచూర్ మార్గంలోని మిషన్ భగీరథ పథకానికి చెందిన రాంరెడ్డి గూడెం పంప్‌హౌస్‌లో శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆయుధ పూజ నిర్వహించారు. ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలో..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని తెలంగాణ స్టేట్ బొటానికల్ గార్డెన్‌లో శుక్రవారం ఆయుధపూజ నిర్వహించారు. సమన్వయకర్త డా. సదాశివయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


జడ్చర్ల బొటానికల్ గార్డెన్‌లో ఆయుధపూజ


బోనాల వేడుకలో పాల్గొన్న భక్తులు

బంగారు మైసమ్మ బోనాలు

నవాబుపేట: కొల్లూర్ పరిధిలోని సత్రోనిపల్లితండాలో శుక్రవారం బంగారు మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే బోనాల ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ రఘు, మాజీ ఎంపీటీసీ తులసీరాం నాయక్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పొన్నకల్‌లో వైద్య శిబిరం

అడ్డాకుల: పొన్నకల్‌లో శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దోనూరు లింగారెడ్డి ఇంటి వద్ద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్థోపెడిక్ వైద్యుడు దోనూరు కల్యాణ్‌రెడ్డి సుమారు 100 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. దోనూరు లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

గొర్రెల కాపరులను ఆదుకోవాలి

దేవరకద్ర: పెద్ద గోప్లాపూర్ శివారులో గురువారం రాత్రి లారీ ప్రమాదంలో గొర్రెలు మృతిచెందిన నేపథ్యంలో బాధిత కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర గొర్రెలు, మేకల సంఘం అధ్యక్షుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ఉన్నారు.

హన్వాడలో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు



హన్వాడ: దసరా పండుగను పురస్కరించుకుని శుక్రవారం మండలకేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు మండలకేంద్రంలోని పురవీధుల గుండా కవాతు నిర్వహించారు. హైందవ ధర్మంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు.

వైద్య విద్యార్థినికి చేయూత



మహబూబ్‌నగర్ రూరల్: కోడూర్‌కి చెందిన ఆకాంక్ష గత సంవత్సరం ఎంబీబీఎస్‌కు అర్హత సాధించి ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో కళాశాల ఖర్చుల నిమిత్తం రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రూ. 85 వేలను శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆమెకు అందజేశారు. విద్యార్థులు ఆకాంక్షను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు రవీందర్, ఆంజనేయులు, కేశవులు, కుర్మయ్య, కృష్ణయాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది


నూతన ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న నాయకులు

మహమ్మదాబాద్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందని మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా పేర్కొన్నారు. నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి శుక్రవారం మండలకేంద్రంలోని రాజేంద్రనగర్‌కాలనీ వాసులు ఘనంగా సన్మానం చేశారు. కాలనీ చైర్మన్ రాంరెడ్డి, కార్యదర్శి వెంకటయ్య, సలీం, అంజన్న, సత్యయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

మూసాపేట మండలంలో..


తాళ్లగడ్డలో..

అడ్డాకుల: మూసాపేట మండలం తాళ్లగడ్డకు చెందిన నాగలక్ష్మి, నర్సిములుగౌడ్ దంపతుల కుమార్తె సంగీత ఉపాధ్యాయ నియామక పరీక్షలో ఎస్జీటీగా ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం మండల నాయకులు శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు శశిధర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు తిరుపతయ్యగౌడ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



దేవరకద్ర: మండలానికి చెందిన గౌడ కులస్తులు శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కలిశారు. వృత్తి పరంగా ఎదుర్కొంటున్న కష్టాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. కులవృత్తిని అందరూ కలిసి కట్టుగా చేసుకోవాలని ఏమైనా ఇబ్బందులు ఉంటే అన్ని విధాల సహకరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రవీందర్, నరేందర్, మధు, రాజు, సుమన్, అశోక్, లక్ష్మయ్య, అంజి, సూరి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం కామర్స్ గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధ తెలియజేశారు. ఎంకాంలో 50శాతం మార్కులు దాటిన వారు ఈనెల 15 లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గండీడ్: మండల అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. శుక్రవారం మండల కేంద్రంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హుస్నాబాద్ వెంకటయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వేపూరి అమృతమ్మ, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రాములు, ఉపాధ్యక్షులుగా ఎం.నర్సింలు, దొడ్డె రాములు, ముత్రిప్ప నర్సింలు, వడ్ల కృష్ణయ్య, చిట్టెల బసప్ప, నాగరాజు, కొమ్ము మల్లేష్, కోశాధికారిగా దొడ్డె కేశవులు, సంయుక్త కార్యదర్శులుగా పకరిరయ్య, లక్ష్మయ్య, మొగలయ్య, జోగు రాములు, కట్టెల దస్తయ్య తదితరులను ఎన్నుకున్నారు.

యువకుడికి గాయాలు

గండీడ్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రుసుంపల్లికి చెందిన గణేష్ కొరియర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో కోస్గి నుంచి కొరియర్ తీసుకొని రుసుంపల్లికి బయలుదేరాడు. చిన్నవార్వాల్ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో గణేష్‌కు కడుపులో తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఎస్వీఎస్‌కు తీసుకెళ్లారు.

బాలికలు చదువులో రాణించాలి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం

మహబూబ్‌నగర్ రూరల్: బాలికలు చదువులో రాణించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాల సదనంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలను రక్షించుకుందాం అని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డీడబ్ల్యూఓ మాట్లాడుతూ మాట్లాడుతూ ఆడపిల్లలపై ఉండే వివక్షత, హింస, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని అన్నారు. బాలికలు స్వయం సమృద్ధి సాధించాలని, గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తుండడం హర్షణీయమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల కోసం అనేక చట్టాలను తీసుకువచ్చాయని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ఆడ పిల్లలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేసి ఇబ్బందులకు గురిచేయద్దని, బాల్య వివాహాలు, ఆడపిల్లల విక్రయం చట్టరీత్యా నేరమని అన్నారు. మహిళా, శిశు సంక్షేమశాఖ, జిల్లా మహిళా సాధికారత, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలికలకు ఆటలు, క్విజ్, పాటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ నయిమొద్దీన్, జేజేబీ గ్రేస్ సీడీపీఓ శైలశ్రీ, బీఆర్పీ కోఆర్డినేటర్ వెంకటమ్మ, డీసీపీఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.